వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయండి

- సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జూలై 12(నమస్తే తెలంగాణ): వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో 63 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో శుక్రవారం వన మహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాలల, ప్రజాపాలన కేంద్రాలు, మహిళా శక్తి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో నాటేందుకు రెడీగా ఉన్నాయని, వర్షాలు కురుస్తున్నందున మొక్కలు బ్రతికే అవకాశం ఉన్నదని, అందుకే మొక్కలు నాటడం ప్రారంభించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయుటకు పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులు చాలా వరకు పూర్తయ్యాయని, వివిధ దశలలో జరుగుతున్న పనులను పూర్తి చేయించేలా పర్యవేక్షించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని, అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కొరత లేదన్నారు. మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకం కింద వచ్చే దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాంబ శివరావు, డీఈవో విజయ కుమారి, అటవీ శాఖ అధికారి జానకి రామ్ పాల్గొన్నారు.

రోగులకు కనీస సౌకర్యాలేవి?

- ఈఎస్ఐ దవాఖానలు, డిస్పెన్సరీలు అధ్వాన్నం
- సరిపడా వైద్యులు, మందులు లేక అస్తవ్యస్తం
- ఈఎస్ఐ డైరెక్టరేట్ వద్ద సీఐటీయూ ధర్నా

ఈఎస్ఐ డైరెక్టరేట్ వద్ద ధర్నా చేసిన సీఐటీయూ నాయకులు

బన్సీలాల్‌పేట్, జూలై 12: తెలంగాణాలో ఉన్న ఈఎస్ఐ దవాఖానాలు, డిస్పెన్సరీలలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని, రోగులకు కనీస సదుపాయాలు కూడా లేవని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. న్యూ బోయిగూడలోని బీమా వైద్య సేవల శాఖ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్త ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ దవాఖానాలు, డిస్పెన్సరీలలో సరిపడా వైద్యులు లేరని, రోగులకు మందులు కూడా ఇవ్వడం లేదని అన్నారు. అధిక శాతం డిస్పెన్సరీలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని, సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో యజమానులు ఖాళీ చేయిస్తున్నారని తెలిపారు. ఎందుకు సొంత భవనాలను నిర్మించడం లేదని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ పరిధిలో మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు ఉన్నాయని తెలిపారు. సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ దవాఖానకు వెళితే బెడ్స్ ఖాళీ లేవని, ప్రైవేట్ దవాఖానకు సిఫారసు చేస్తున్నారని పేర్కొన్నారు. దాని వలన ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. అనేక డిస్పెన్సరీలలో మెడికల్ ఆఫీసర్లు లేకపోవడంతో ఫార్మాసిస్టులే మందులను ఇస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐలను సరైన సమయంలో జమ చేయడం లేదని, కాంట్రాక్టర్ల గడువు ముగిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జహీరాబాద్ పారిశ్రామికంగా విస్తరిస్తున్నదని, అక్కడ 50 పడకల దవాఖాన నిర్మించాలని, గద్వాలలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని, కాగజ్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐ దవాఖానను మెరుగుపరచాలని, నూతన భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన తెలిపారు. బీమా వైద్యసేవల శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.గౌతమ్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు కుమారస్వామి, రుద్రరాజు, మహేందర్, నర్సింగరావులతో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 12: ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరేళ్ల నుంచి విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. రాష్ట్రంలో ఏడాదికి 14 లక్షల మంది విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని అన్నారు. వారికి ఏడాదికి రూ.3 వేల కోట్లు అవసరమవుతున్నాయని, కానీ, పూర్తి స్థాయిలో చెల్లించడం లేదన్నారు. 2019 నుంచి 2023 వరకు రూ.8214.57 కోట్లు ఫీజు బకాయిలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్పా ట్రెజరీల నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఉన్నత చదువుల కోసం పేద విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, యాజమాన్యాలకు డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా బకాయిలు విడుదల చేయని కారణంగా కళాశాల మూసివేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు కార్తీక్, నాయకులు అరుణ్, వంశీ, మనోజ్, కిరణ్, అవినాష్, శ్యాంరావు, సుబ్బు, బాలు, అజయ్, శ్రీనివాస్, తేజ, నాయకులు పాల్గొన్నారు.

ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సినీ నటుడు తనికెళ్ల భరణి

టీ-వర్క్స్ నూతన ఆవిష్కరణలకు నాంది

సిటీబ్యూరో, జూలై 12(నమస్తే తెలంగాణ)/ సుల్తాన్ బజార్: కొత్త ఆలోచనలతో ఆవిష్కరణలు చేయాలన్న వారిని ప్రోత్సహించేందుకు టీ వర్క్స్ ప్రత్యేకంగా రెండు రోజుల పాటు వర్క్‌షాపును ప్రారంభించింది. హైదరాబాద్ మెట్రో రైలు కారిడార్‌లోని ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో 'మేక్ ఇట్ మెట్రో' పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సినీ నటులు తనికెళ్ల భరణి ప్రారంభించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ, భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు టీ వర్క్స్ గొప్ప అవకాశమన్నారు. తాను మెట్రో రైలు ఎక్కి చాలా రోజులైందని, ఎంతో మంది రాకపోకలు సాగించే ఇలాంటి చోట టీ వర్క్స్ చేపట్టిన కార్యక్రమంతో తయారీ రంగంలో సరికొత్త ఉత్పత్తులను రూపొందించేందుకు దోహదం చేస్తుందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాపులో 3డీ ప్రింటింగ్, సర్క్యూట్ మాస్టరింగ్, సిరామిక్ క్రాఫ్టింగ్, బ్లాక్ ప్రింటింగ్‌ల తయారీపై నిపుణులు శిక్షణనిచ్చారు.

ఎస్ఎంఏ వ్యాధిని ఆదిలోనే అంతం చేయాలి

ఆగస్టు 4న స్పైనల్ మస్కులర్ అట్రోఫీపై అవగాహన రన్

ఖైరతాబాద్, జూలై 12: తెలిసీ, తెలియని వయస్సులో ఎంతో మంది చిన్నారులు భయంకరమైన ఎస్ఎంఏ (స్పైనల్ మస్కులర్ అట్రోఫీ) బారినపడుతున్నారని, ఆ వ్యాధిని ఆదిలోనే అంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని రెయిన్ బో ఆస్పత్రి పిల్లల వైద్యుడు రమేశ్ కోనంకి అన్నారు. ఎస్ఎంఏ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు 4న గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 6 గంటలకు నిర్వహించే రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఎర్రమంజిల్‌లో జరిగిన కార్యక్రమంలో రెయిన్‌బో ఆస్పత్రి పిల్లల వైద్యుడు రమేశ్ కోనంకి, ఐజీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సునీత, క్యూర్ ఎస్ఎంఏ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సహ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్, పేషెంట్ అడ్వకేసీ శ్రీలక్ష్మి నాళం, క్యూర్ ఎస్ఎంఏ రీజినల్ కో ఆర్డినేటర్ సతీశ్ పాల్గొన్నారు. కాగా, రమేశ్ కోనంకి మాట్లాడుతూ ఎస్ఎంఏ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న రన్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీకి గ్రీన్ అవార్డు

- ఐఎస్ఓ సర్టిఫికెట్లు ప్రదానం

సిటీబ్యూరో, జూలై 12(నమస్తే తెలంగాణ)/ శేరి లింగంపల్లి: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ)కు గ్రీన్ అవార్డుతో సహా నాలుగు ఐఎస్ఓ సర్టిఫికెట్స్ రావడంపై కాలేజీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు హర్షం వ్యక్తం చేశారు. కాలేజీ బోర్డు రూంలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివరాం ఆలపాటి ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను డాక్టర్ జి.రామేశ్వర్ రావుకు అందించారు. కాలేజీలో పరిపాలన వ్యవహారాలు, డాక్యుమెంటేషన్ విధానాలు, సమయ పాలన, ఫైళ్ల సత్వర పరిష్కారం తదితర వాటిలో అద్భుతమైన ప్రతిభ కనబరిచినందుకు గాను ఐఎస్ఓ9001 క్వాలిటీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ ప్రదానం చేసింది. రామేశ్వర్ రావు మాట్లాడుతూ, అవార్డు, ప్రశంసా పత్రం రావడం వెనక తమ కాలేజీ సిబ్బంది, అధికారుల శ్రమ ఉందని తెలిపారు. వారంతా అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత రావు, వెంకట శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో మాలిక్ కియా..

జూబ్లీహిల్స్, జూలై 12: తెలంగాణలోని ప్రముఖ కెఐఏ డీలర్‌లలో ఒకరైన మాలిక్ కియా నగరంలోని హిమాయత్‌నగర్‌లో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో తమ 4వ షోరూమ్‌ను ప్రారంభించారు. మాలిక్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అత్యున్నత స్థాయి సౌకర్యాలను అందించడంతో పాటు వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు రాష్ట్ర వ్యాప్తంగా షోరూమ్‌లను విస్తరిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. షోరూమ్ సోనెట్, సెల్టోస్, కేరెన్స్, ఈవీ 6తో సహా విభిన్న రకాల మోడళ్లను విక్రయానికి అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. అదనంగా, వాహన సర్వీసింగ్ కోసం ఉచిత పిక్ అండ్ డ్రాప్ సౌకర్యం అందజేస్తున్నట్లు తెలిపారు.

పీర్జాదిగూడలో ఆ భూములు కొనుగోలు చేయొద్దు

సాలార్జంగ్ వారసుడి విజ్ఞప్తి

ఖైరతాబాద్, జూలై 12: ఇటీవల పీర్జాదిగూడలో వివాదాస్పదమైన ప్రభుత్వ సంరక్షణలో ఉన్న సాలార్జంగ్‌కు చెందిన భూములను కొనుగోలు చేయొద్దని సాలార్జంగ్ వారసుడు అబ్దుల్ వాహెబ్ విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో న్యాయవాది జితేందర్ రెడ్డి, బొల్లం లక్ష్మణ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. నిజాం తదనంతరం ప్రధానిగా పనిచేసిన సాలార్జంగ్‌కు పీర్జాదిగూడ ప్రాంతంలో 362 ఎకరాల 15 గుంటల స్థలం ఉందన్నారు. కాగా, నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి ఆ స్థలాన్ని విక్రయిస్తున్నట్లు చెప్పారు. సదరు భూములను కొనుగోలు చేసిన వారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి భూముల విక్రయాలు జరగకుండా అడ్డుకట్ట వేసి పేద, మధ్య తరగతి ప్రజలు మోసపోకుండా కాపాడాలన్నారు.

14 వరకు థాయ్‌లాండ్ షాపింగ్ ఫెస్టివల్

ఆకట్టుకునే హోమ్ ఫర్నిచర్ ఎక్స్‌పో..

జూబ్లీహిల్స్, జూలై 12: హైటెక్ సిటీలో జూలై 12 నుంచి 14 వరకు థాయ్‌లాండ్ షాపింగ్ ఫెస్టివల్‌తో పాటు హోమ్ ఫర్నిచర్ ఎక్స్‌పో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంటిని సొగసైన అభిరుచులతో పాటు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే అలంకరణతో తీర్చిదిద్దేందుకు ఆకర్షణీయమైన ఫర్నిచర్, ఇంటీరియర్ డెకరేషన్స్‌కు వైవిధ్యమైన మోడల్స్ లభ్యమవుతామయని వెల్లడించారు. థాయ్‌లాండ్ షాపింగ్ ఫెస్టివల్‌లో మహిళల ఉపకరణాలు, ఉడ్ కిచెన్ ఉపకరణాలు, థాయ్ బామ్, థాయ్ స్పా ఉత్పత్తులు, కొరియన్ ఉపకరణాలు, టర్కీ లైట్లు, ఆఫ్ఘనిస్తాన్ డ్రై ఫ్రూట్స్, ముత్యాల ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు తెలిపారు. ఇంటీరియర్‌లో సోఫా సెట్లు, డైనింగ్ టేబుల్స్, బెడ్‌రూమ్ యూనిట్లు, ఆఫీస్ ఫర్నిచర్, మాడ్యులర్ కిచెన్ యూనిట్లు, రిక్లైనర్ సెట్లలో వేలాది రూట్‌లు ఎక్స్‌పోలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

శంషాబాద్ రూరల్, జూలై 12: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శంషాబాద్ పట్టణంలో మాదిగ జేఏసీ, మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 27 తేదీన శంషాబాద్ పట్టణంలో బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

దళిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

కీసర దళితుల తరపున జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్ హన్మంతరావు

మేడ్చల్, జూలై 12(నమస్తే తెలంగాణ): మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కీసర దళిత రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వీహెచ్ హన్మంతరావు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ గౌతమ్‌ను శుక్రవారం కలిసి దళితుల తరపున వినతి పత్రం సమర్పించారు. కీసరలో 1981 సంవత్సరంలో 179, 213, 174, 175, 176, 173 సర్వే నెంబర్లలో ఉన్న 94.02 ఎకరాల భూమిని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టాదారుడైన రాగి కృష్ణారెడ్డి దళితులకు కేటాయించారని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న కీసరలో భూముల ధరలు విపరీతంగా పెరిగిన క్రమంలో జీవో నం.1717 ద్వారా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఫోర్జరి సంతకాల ద్వారా దళితులకు ఇచ్చిన భూమిని తీసుకుని రికార్డులలో తారుమారు చేసి రూ.500 కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డట్లు వీహెచ్ హన్మంతరావు ఆరోపించారు. ఈ భూములపై కోర్టులో కేసు నడుస్తున్నా, హెచ్ఎండీఏ ఇండ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని కలెక్టర్ గౌతమ్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వీహెచ్ పేర్కొన్నారు.

150 కుటుంబాలకు అన్యాయం

భూ కుంభకోణం ద్వారా కీసరలోని 150 మంది కుటుంబ సభ్యులకు అన్యాయం జరిగిందని వీహెచ్ తీవ్రంగా ఆరోపించారు. ఫోర్జరీ సంతకాలు చేసి రికార్డుల నమోదు చేసుకున్న భూమిని రియల్టర్లకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయాలన్నారు. ప్రస్తుతం, దళితులకు చెందిన భూములలో జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్‌ను కోరారు. దళితులకు భూమి చెందేవరకు దళితుల పక్షాన నిలబడుతానన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కమిషనర్ విక్రమాన్ సింగ్ తదితరులు

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

మెహిదీపట్నం జూలై 12: తెలంగాణ ఆషాఢ మాసం బోనాలను జరుపుకోవడానికి గోల్కొండ జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయానికి వస్తున్న లక్షలాది మంది భక్తులకు అసౌకర్యాలు కల్గకుండా ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ అధికారులను ఆదేశించారు. బోనాల నిర్వహణకు సమావేశాలు నిర్వహించి ఎన్ని సూచనలను చేసినా అధికారులు తమ పనులను సక్రమంగా నిర్వర్తించకపోవడంపై ఆమె ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం గోల్కొండలో అధికారులతో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారా మయ్యార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గోల్కొండ కోటకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు ఇప్పటికైనా మెరుగు పరిచి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటం, కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడం, టాయిలెట్లు సరిగా లేకపోవడంపై ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ సంబంధిత అధికారులపై మండిపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి మాట్లాడుతూ, గోల్కొండ బోనాల కోసం ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపులో అధికారులంతా ఎప్పటికప్పుడు తమ పనులను అప్డేట్ చేయాలని సూచించారు. సమావేశంలో పోలీస్ అదనపు కమిషనర్ విక్రమాన్ సింగ్, ఎండోమెంట్ కమిషనర్ హన్మంత రావు, డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్,అదనపు డీసీపీ అశ్వక్ అహ్మద్, జీహెచ్ఎంసీ సర్కిల్ –13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు జీవన్ సింగ్ పాల్గొన్నారు.

గడిచిన కొంత కాలంగా.. నిలిచిన రియల్ రంగం

- ఆగస్టు నుంచి రియల్ అమ్మకాల పెరుగుతాయని ఆశిస్తున్నాం
- వచ్చే నెలలో మూడు చోట్ల భారీ ప్రాపర్టీ షోలు నిర్వహిస్తున్నాం
- హైదరాబాద్ క్రెడాయ్ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లడి

సిటీబ్యూరో, జూలై 12(నమస్తే తెలంగాణ): గడిచిన ఎనిమిది నెలలుగా హైదరాబాద్ రియల్ రంగం నిలిచి పోయిందని, వరుస ఎన్నికలు, నూతన ప్రభుత్వ ఏర్పాటు ఇందుకు కారణమని, వచ్చే నెల నుంచి రియల్ రంగం మళ్లీ ఊపు అందుకుంటుందని హైదరాబాద్ క్రెడాయ్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజశేఖర్ రెడ్డి, బి.జగన్నాథ రావులు అన్నారు. నగరంలో రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్ హైదరాబాద్ శాఖ) ప్రతినిధులు మాట్లాడారు. ఆగస్టులో గ్రేటర్‌లో మూడు భారీ ప్రాపర్టీ షోలను నిర్వహించనున్నామని, వివిధ ప్రాంతాల్లోని వాణిజ్య, నివాస ఆస్తుల అమ్మకాలకు ఒకేచోట భారీ ఎక్స్‌పోలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వి.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 2, 3, 4 వ తేదీల్లో హైటెక్స్‌లో హాల్ నం 4 వేదికగా, వచ్చే నెల 9, 10, 11వ తేదీల్లో కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో, 23, 24, 25 తేదీల్లో నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ప్రాపర్టీ షోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రాపర్టీ షోను సీఎం రేవంత్‌రెడ్డి, రెండవ విడతలో మంత్రి శ్రీధర్ బాబు, మూడో విడత ప్రాపర్టీ షోను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. క్రెడాయ్ చేపడుతున్న ప్రాపర్టీ షోలకు మంచి స్పందన వస్తుందని, గత మార్చిలో నిర్వహించిన ప్రాపర్టీ షోలో స్టాల్ నుంచే 25 యూనిట్లు అమ్ముడుపోయినట్లు, ఇది మొట్ట మొదటి సారి అని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ క్రెడాయ్ ఎలక్ట్ ప్రెసిడెంట్ జైదీప్ రెడ్డి పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు

సిటీబ్యూరో, జూలై 12 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాన్ని గుర్తించి, వెంటనే గోల్డెన్ అవర్‌లో సైబర్‌క్రైమ్ పోలీస్, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ –1930 ఫిర్యాదు చేస్తే పోయిన డబ్బులు తిరిగి వచ్చేందుకు అవకాశం ఉన్నదని సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపారు. ఈ నెల 9న ఓ మెడికల్ ప్రొఫెషనల్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి రూ. 17.45 లక్షలు కాజేశారు. వెంటనే ఆయన ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌కు ఫిర్యాదు చేయడంతో 22 నిమిషాల్లోనే ఆ డబ్బును ఫ్రీజ్ చేశారు. 11న ప్రైవేట్ ఉద్యోగి సైబర్‌నేరగాళ్ల చేతిలో రూ.3.79 లక్షలు మోసపోయాడు. వెంటనే హైదరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో సంప్రదించడంతో ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో విధుల్లో ఉన్న పోలీసు అధికారి శ్రీకాంత్ నాయక్ ఫిర్యాదు చేయించారు. 21 నిమిషాల వ్యవధిలోనే ఆ మొత్తం నగదు ఖాతాలో ఫ్రీజయ్యాయి. అదే రోజు రాత్రి ఒక బాధితుడు రూ. 97,312 పోగొట్టుకున్నాడు. వెంటనే రాత్రి విధుల్లో ఉన్న సందీప్ అనే పోలీసు అధికారి బాధితుడి డబ్బు పోయిన ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించి, మర్చంట్ లోకేషన్‌ను గుర్తించి ఆ డబ్బును బ్లాక్ చేయించాడు. నేరం జరిగిన వెంటనే తేరుకొని నేషనల్ సైబర్‌క్రైమ్ పోర్టల్, సైబర్‌క్రైమ్ ఠాణా, హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసినట్టయితే.. పోయిన డబ్బును ఫ్రీజ్ చేసి, తిరిగి బాధితుడికి చేరే అవకాశం ఉన్నదని పోలీసులు సూచించారు.

హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, జులై 12: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలను ఇచ్చినట్లు తెలిపారు. అమెజాన్ సంస్థ మండల పరిధిలోని నేదునూరు గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, కొత్తూరు గ్రామంలో నిర్మించిన గ్రంథాలయ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, బడంగ్‌పేట్‌లో నిర్మించిన జిల్లా గ్రంథాలయంలో సోలార్‌ను ఏర్పాటు చేయాలని అమెజాన్ అధికారులను కోరారు. ప్రతి ఒక్కరు పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వంపై పోరాడి నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు రామక్రిష్ణారెడ్డి, పల్లె వసంత క్రిష్ణాగౌడ్, అమెజాన్ ఉద్యోగులు శంకర్, చైతన్య, పాటక్, విజయ్, పార్థసారథి, సురేశ్, నారాజు, శివక్రిష్ణ, సుధాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురసాని రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, అంజయ్య గౌడ్, మహిళా అధ్యక్షుడు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, గోరెంకల రామక్రిష్ణ, మాజీ సర్పంచ్‌ల గోవర్ధన్, గోపాల్‌రెడ్డి, డైరెక్టరు పొట్టి ఆనంద్, మాజీ డైరెక్టరు సామ ప్రకాశ్‌రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, దేవీలాల్ నాయక్, బర్కం వెంకటేశ్, ఆనెగౌని దామోదర్ గౌడ్, సురసాని కొండల్‌రెడ్డి, సంజీవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మాణాచారి, గుయ్యని సామయ్య, క్రిష్ణ, నవీన్, నరేందర్, ఎంపీడీఓ సరిత, ఎంపీఎచ్ఓ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

వృద్ధుల సమస్య పరిష్కారానికి వెబ్ పోర్టల్

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, జూలై 12(నమస్తే తెలంగాణ): వయోవృద్ధుల సమస్యలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా త్వరలో ప్రత్యేక వెబ్ పోర్టల్ సేవలు ప్రారంభిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 200పై చిలుకు వయో వృద్ధుల ఆస్తి వివాదాలను పరిష్కరించామని చెప్పారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వృద్ధాశ్రమాలు సరైన విధంగా నడిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా వయో వృద్ధుల సంక్షేమ అధికారి ఏ.రాజేందర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, ఏసీపీ ఆంజనేయులు, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్ పాల్గొన్నారు.